మాట్లాడుతున్న మేయర్ వై సునీల్‌రావు

అట్టహాసంగా జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

- పలు రాష్ట్రాల నుంచి హాజరైన సుమారు 900 మంది క్రీడాకారులు

కొత్తపల్లి, ఆగస్టు 4 : గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ కప్ మొదటి జాతీయ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రేకుర్తి లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ పోటీల ప్రారంభోత్సవానికి మేయర్ వై సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, జానపద కళాకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడైన గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ కప్ పేరుతో కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం నెలకొన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. గౌరు నారాయణ రెడ్డి కుమారుడు గౌరు రాజిరెడ్డి దశాబ్దకాలంగా నగరంలోని ధన్లర్‌వాడీ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉచిత కరాటే శిక్షణ ఇస్తుండడం ప్రశంసనీయమన్నారు. మరో అతిథి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ, కరీంనగర్ క్రీడలకు నిలయంగా మారుతున్నదన్నారు. విద్యార్థులు ఫిట్‌గా ఉన్నప్పుడే ఏదైనా సాధించే సత్తా వారిలో ఏర్పడుతుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని మేయర్ పోటీలను ప్రారంభించారు. పోటీలకు పలు రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కటా, కుమిటీ, టీం కటా, వెపన్ కటా విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నారు. కుమిటీ విభాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్‌కు పోటీలు నిర్వహించి చాంపియన్‌షిప్ సాధించిన వారికి నగదు పారితోషికం అందించనున్నట్లు నిర్వాహకుడు గౌరు రాజిరెడ్డి తెలిపారు. ఉదయం ప్రారంభమైన పోటీలు రాత్రి వరకు కొనసాగాయి. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, వీ రవీందర్‌కుమార్, కె. వసంత్‌కుమార్, నాయుడు, కె. గణేశ్, ఇ. శ్రీనివాస్, వీ నరేందర్, సీహెచ్ సాయికుమార్, పి. వెంకటేషం, ఎన్. సదానందం, పి. పాపయ్య, మొండయ్య, సురభి వేణుగోపాల్, మన్నన్, సంపత్, ఆర్ ప్రసన్నకృష్ణ, కోడూరి శేఖర్, పి. శ్రీనివాస్, ఎం. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరవాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- శ్రీరాంనగర్ కాలనీలో సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- మేయర్ సునీల్‌రావు

శ్రీరాంపూర్ కాలనీ వాసులతో నగర మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, ఆగస్టు 4: నగర వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వచ్చే ఆరు మాసాల్లో వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని, నగరవాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలో గల శ్రీరాంనగర్ కాలనీలో మేయర్ పర్యటించారు. శ్రీరామ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి యూనివర్సిటీ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరాన్ని సందర్శించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం శ్రీరాంనగర్ కాలనీలో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, శ్రీరాంపూర్ కాలనీ దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నదన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గతంలోనే నగరపాలక సంస్థ మల్కాపూర్ రోడ్డును స్మార్ట్ రోడ్డుగా మార్చి ప్రజలకు మంచి రవాణా సౌకర్యం కల్పించిందన్నారు. యూనివర్సిటీ ప్రహరీని ఆనుకొని ట్రైల్స్, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి నైట్ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశామన్నారు. అదే సమయంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు నగరపాలక సంస్థ ద్వారా శ్రీరామ మందిర నిర్మాణం చేశామన్నారు. మూడు రోజుల శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి నగరపాలక సంస్థ ద్వారా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరైన వెంటనే కాలనీలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండపల్లి సరితాసతీశ్, శ్రీరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.మాధవ రావు, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు విజయసింహారావు, కోశాధికారి నర్సింహాచారి, పలువురు కార్యవర్గ సభ్యులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

నగర ప్రజలు అమ్మవార్ల ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో జీవించాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆకాంక్షించారు. ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా నగరంలోని 28వ డివిజన్ ఆదర్శనగర్‌లో జరిగిన బోనాల జాతర మహోత్సవానికి హాజరయ్యారు. 46వ డివిజన్‌లో మైసమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాంపెల్లి శ్రీనివాస్, వంగల శ్రీదేవీ పవన్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు మాచర్ల ప్రసాద్, గొట్టిముక్కుల ఉమా రమణ, భక్తులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, ఆగస్టు 4: రెడ్డిపల్లి శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. వీణవంకకు చెందిన గంట వెంకటేశ్, నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సిద్దంకి భాస్కర్ మండలంలోని గ్రామాల్లో బియ్యం కొనుగోలు చేసి ట్రాలీలో తరలిస్తుండగా, పట్టుకున్నట్లు చెప్పారు.

సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం

తెలంగాణచౌక్, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తొమ్మిదో డివిజన్ మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏబీసీడీ వర్గీకరణతో ఎస్సీ ఎస్టీ ఉపకులాలకు రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందన్నారు.

చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

గంగాధర, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 7,8,9వ తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో తలపెట్టనున్న మహా ధర్నా కార్యక్రమానికి మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చిన విజయవంతం చేయాలని మాల మహానాడు మండలాధ్యక్షుడు తాళ్ల సురేశ్, నాయకుడు తాళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్‌లో ధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇవ్వడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జవ్వాజి మహేందర్, ముద్దం రమేశ్, లక్ష్మణ్, అంజయ్య, లక్ష్మణ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

కలెక్టరేట్, ఆగస్టు 4: అప్పుడే పుట్టిన బిడ్డకు ముందుగా తల్లిపాలు అందించడమే శ్రేయస్కరమని, ముర్రుపాలతో నవజాత శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో జి.ఉమారాణి తెలిపారు. ఆదివారం నగరంలోని సవరన్ స్ట్రీట్ సెక్టార్‌లో గల కార్జానాగడ్డ 1 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. రెండున్నరేళ్లు దాటిన పలువురు బాలలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నయీమున్నీసా బేగం, వరలక్ష్మి, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, కేంద్రం పరిధిలోని బాలింతలు, గర్భిణులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు వెంటనే పంపిణీ చేయాలి

హుజూరాబాద్, ఆగస్టు 4: హుజూరాబాద్ నియోజకవర్గంలోని కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు వెంటనే చెక్కులను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిలుకూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వారం రోజుల్లోగా చెక్కుల పంపిణీ చేపట్టకపోతే లబ్ధిదారులతో కలిసి ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజిరెడ్డి, నాయకులు మైదం శెట్టి యుగంధర్, కుమార్ స్వామి తదితరులు ఉన్నారు.

ఆలయాలు హైందవ సమాచార కేంద్రాలుగా మారాలి

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 4 : హిందూ దేవాలయాలు హైందవ సమాచార కేంద్రాలుగా మారాలని, సనాతన శ్రీ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైశ్యభవన్‌లో నగరంలోని స్వామి వివేకానంద విద్యాపరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయాల ఏకీకరణ-హైందవ చైతన్య వేదిక అంశంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, హిందువులంతా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పురాణం మహేశ్వర శర్మ, సురేశ్ ఆత్మారాం, రమేశ్ బాబు, విశ్వనాథం పాల్గొన్నారు.

'కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి'

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 4 : రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లోని స్థానిక టీఎన్జీవో హాల్‌లో జరిగిన పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో గణనీయంగా విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం ఏకోపాధ్యాయ పాఠశాల లేనని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శుంకిశాల ప్రభాకర్ రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు భాజా మజ్జారలీ, ప్రధాన కార్యదర్శి చింతపల్లి అశోక్ రావు, నాయకులు రవికుమార్, దయాకర్, మధుచంద్ర, సర్వర్, మహేందర్, మహేందర్, రాజు, సలీం, అనిల్, మల్లేశ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా 'అల్ఫోర్స్ థ్రిల్'

ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 4: అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో థ్రిల్ పేరుతో నిర్వహించిన కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వేడుకలను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ప్రతి సంవత్సరం స్వాగతోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో పరిపూర్ణ జీవితం

శంకరపట్నం, ఆగస్టు 4: ఆధ్యాత్మికతతో జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుందని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కరీంపేట్ గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామ సేవా కార్యక్రమం నిర్వహించారు. బాలవికాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో బాల్య దశ నుంచే ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో బాల సేవ, గృహ భజనలు చేశారు. తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణంలో మొక్కలు నాటారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు లక్ష్మీపతి, తనుకు ఓంకారం, నరేశ్, మహేశ్, వరుణ్, కృష్ణ, సతీశ్, రాంప్రసాద్, సౌమ్య, సరిత, సంతోష్, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆగస్టు 4: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో వీర బుచ్చయ్య స్నేహితులతో కలిసి కేక్ కట్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

వీణవంక/ కొత్తపల్లి, ఆగస్టు 4: వీణవంక మండలం చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు (1985-86 పదో తరగతి బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అందరూ ఒక చోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. కొత్తపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2005-2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మరథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి

కొత్తపల్లి, ఆగస్టు 4 : కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్టుల సంఘం, జిల్లా పరిపాలన సహకారంతో సెప్టెంబర్ 22న నిర్వహించనున్న రెండో ఎడిషన్ మారథాన్ పోస్టర్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం సాయంత్రం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు పసుల మహేశ్ తెలిపారు. గతేడాది నిర్వహించిన ఒకటో ఎడిషన్ విజయవంతం కావడంతో మారథాన్ 2వ ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 7759265758 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శివ, అఖిల్, స్వప్న పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, ఆగస్టు 4 : జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలను నిర్వహించారు. అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లై విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో కీర్తి చంద్రశేఖర్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేట శివాలయంలో బోయపాటి పూజలు

గోపాల్‌రావుపేట శివాలయంలో అర్చకులతో సినీ దర్శకుడు బోయపాటి శ్రీనివాస్

రామడుగు, ఆగస్టు 4: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడి శివాలయం ప్రసిద్ధి చెందిన దని తెలుసుకొని సందర్శనకు వచ్చినట్టు ఆయన తెలిపారు. కాగా, ఇక్కడి శివాలయానికి బోయపాటి వచ్చినట్టు తెలియగానే ఆలయానికి సందర్శకుల తాకిడి పెరిగింది. మధ్యాహ్నం పూజల అనంతరం హైదరాబాద్ తిరిగి వెళ్లిపోయారు. ఇక్కడ ఆలయ అర్చకులు దుర్గేటి రవికిరణాచార్యులు, నూనె మహేశ్‌శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నార్ల రమేశ్, నేచర్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరశురాములుగౌడ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, తదితరులు ఉన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన స్నేహితులు

చిన్ననాటి స్నేహితులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

విద్యానగర్, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆయన చిన్ననాటి స్నేహితులు, సరస్వతీ శిశుమందిర్ క్లాస్ మేట్లు 35 మంది హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, అకస్మాత్తుగా వచ్చిన స్నేహితులందరినీ చూసిన సంజయ్ అందరినీ పేరుపేరునా పలుకరిస్తూ, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సరదాగా గడిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

రాంనగర్, ఆగస్టు 4 : కరీంనగర్ పద్మనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న కార్మికుడు ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం సాలపల్లి గ్రామానికి చెందిన కటకం సత్యం (48) వారం క్రితం కరీంనగర్‌లోని పద్మనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో కాంట్రాక్టర్ కింద పని చేసేందుకు వచ్చాడు. రోజువారీ పనిలో భాగంగా పాఠశాల ఆవరణలో గ్రౌండ్‌లో రన్నింగ్ ట్రాక్‌లో జెట్ ప్రెషర్ మిషన్‌తో పనిచేస్తుండగా అకస్మాత్తుగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. పాఠశాల వాచ్‌మెన్ గమనించి వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి హుటాహుటిన ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సత్యంను పరీక్షించిన వైద్యులు, అప్పటికే అతడు చనిపోయినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు సత్యం విద్యుత్ షాక్‌తో మరణించినట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

సీనియర్ పాత్రికేయుడి మృతికి ప్రముఖుల సంతాపం

హుజూరాబాద్ రూరల్/శంకరపట్నం, ఆగస్టు 4: హుజూరాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్న సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ న్యాయవాది బానాల శ్యాంసుందర్ (60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందగా, పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం హుజూరాబాద్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. పలు పత్రికల్లో జర్నలిస్టుగా సేవలందించారు. హుజూరాబాద్‌లోని నివాసంలో మృతదేహాన్ని ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు, పలువురు రాజకీయ నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు సందర్శించి నివాళులర్పించారు. శ్యాంసుందర్ ఆకస్మిక మృతి పట్ల మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తిమ్మాపూర్, ఆగస్టు 4: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల తాపాల లక్ష్మీనృసింహాస్వామి వారి 20వ అధ్యయన బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ బాధ్యులు ఆలయ ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 13నుంచి 19 వరకు వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనుండగా, 19న శకటోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు తిరునగిరి వెంకటాద్రి స్వామి, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆటవస్తువుల వితరణ

వాలీబాల్ నెట్‌ను ప్రారంభిస్తున్న కాంతాకుమారి తదితరులు

తిమ్మాపూర్, ఆగస్టు 4: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల మానసిక వికలాంగుల పాఠశాలకు సురభి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆట వస్తువులు, వంట సామగ్రి వితరణ, మరుగుదొడ్ల నిర్మాణం చేయగా.. ఎమ్మెల్యే వడ్డూరి లక్ష్మణ్ సతీమణి కాంతాకుమారి శనివారం ప్రారంభించారు. పిల్లలతో కలిసి ఆడిపాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్, ఏపో బాలరాజు, ఇన్స్ట్రక్టర్ రమేశ్‌తో పాటు పుల్లూరి సత్యనారాయణ, కనకయ్య, వసంత, రవీందర్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 4: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీ మేరకు బీసీ కులగణన చేపట్టి, 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అది మల్లేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

'మేముసైతం సేవా సమితి' ఔదార్యం

గంగాధర, ఆగస్టు 4: తల్లిదండ్రుల మృతితో ఒంటరి అయిన ఓ బాలికకు ఉప్పరమల్యాల మేముసైతం సేవా సమితి సభ్యులు అండగా నిలిచి ఔదార్యాన్ని చాటారు. బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన నూనె అశ్విని తల్లిదండ్రులిద్దరూ మృతిచెందగా, గంగాధర మండలం ఉప్పరమల్యాలలోని అమ్మమ్మ దగ్గర ఉంటున్నది. విషయం తెలుసుకున్న ఉప్పరమల్యాల మేముసైతం సేవా సమితి సభ్యులు ఆదివారం అశ్విని వద్దకు వెళ్లి, వివరాలు తెలుసుకొని రూ.10 వేలు ఆమె పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కాగా, సేవాసమితి సభ్యులకు అశ్విని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అన్నదానం

కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలో అన్నదానం చేస్తున్న శ్రీచైతన్య కళాశాల పూర్వ ఎంబీఏ విద్యార్థులు

విద్యానగర్, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవం సందర్భంగా నగరంలోని శ్రీచైతన్య కళాశాల 2008-10 ఎంబీఏ విద్యార్థులు సామాజిక సేవ చేశారు. ఆదివారం ప్రభుత్వ ప్రధాన దవాఖాన ఆవరణలో అన్నదానం చేసి సేవా భావాన్ని చాటుకున్నారు.

డాక్టర్ ఐలయ్యను సన్మానించిన ఎమ్మెల్యే

చిగురుమామిడి, ఆగస్టు 4: మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు, కరాటే మాస్టర్ బొల్లు ఐలయ్య ఇటీవల డాక్టరేట్ అందుకోగా, నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ నేషనల్ కరాటే టోర్నమెంట్ కార్యక్రమంలో ఆయనను సకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘనంగా సత్కరించి అభినందించారు. ఇక్కడ తెలంగాణ కరాటే చీఫ్ రాపోలు సుదర్శన్, రమేశ్, రవితేజ, భానుతేజ తదితరులు ఉన్నారు.

చేనేత, జౌళి శాఖలో విస్తరణాధికారుల బదిలీ

కలెక్టరేట్, ఆగస్టు 4: చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయంలో ఇద్దరు విస్తరణాధికారులు బదిలీ అయ్యారు. జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి సిద్ధిపేట జిల్లాకు, అనిత హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా, వీరి స్థానంలో సిరిసిల్ల జిల్లా నుంచి అజార్ వాహెబ్, సిద్ధిపేట జిల్లా నుంచి సంతోష్ జిల్లాకు వచ్చి విధుల్లో చేరినట్లు, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ ఆదివారం తెలిపారు.

ఉద్యోగ ఖాళీల వివరాల్లేని జాబ్ క్యాలెండర్ ఎందుకు?

కలెక్టరేట్, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగ ఖాళీల వివరాలే లేవని, జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేసి సీఎం, మంత్రులు గొప్పలకు పోతున్నారని తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్